వేదసార శివ స్తోత్రమ్ - భావార్థముతో.



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ శంకరాచార్య విరచిత

వేదసార శివ స్తోత్రమ్ - భావార్థముతో.

01.పశూనాం పతిం పాపనాశం పరేశం
గజేన్ద్రస్య కృత్తిం వసానం వరేణ్యమ్।
జటాజూట మధ్యే స్ఫురద్గాఙ్గ వారిం
మహాదేవ మేకం స్మరామి స్మరారిమ్॥

సమస్త ప్రాణులకు ప్రభువు, పాపనాశకుడు, పరమేశ్వరుడు, ఏనుగు చర్మమును ధరించినవాడు, ప్రార్థించదగినవాడు, జటాజూటము నందు గంగను మోయుచున్నవాడు, మన్మథుని సంహరించినవాడు అగు మహాదేవుని ఒక్కనినే స్మరించుచున్నాను.

02. మహేశం సురేశం సురారాతి నాశం
విభుం విశ్వనాథం విభూత్యఙ్గ భూషమ్।
విరూపాక్ష మిన్ద్వర్క వహ్ని త్రినేత్రం
సదానన్దమీడే ప్రభుం పంఞ్చ వక్త్రమ్॥

మహేశ్వరుడు, దేవతలను కూడ శాసించువాడు, రాక్షసులను సంహరించు వాడు, అంతటా వ్యాపించినవాడు, ప్రపంచమును పాలించువాడు, విభూతితో దేహము నలంకరించు కున్నవాడు, ఎగుడు దిగుడు కన్నులవాడు, చంద్రుడు, సూర్యుడు, అగ్ని అను మూడు నేత్రములు కలవాడు, సదానందరూపుడు, పంచముఖము లున్నవాడు, అగు పరమశివుని స్తుతించు చున్నాను.

03. గిరీశం గణేశం గళే నీలవర్ణం
గవేన్ద్రాధి రూఢం గుణాతీత రూపం।
భవం భాస్వరం భస్మనా భూషితాఙ్గం
భవానీ కళత్రం భజే పఞ్చ వక్త్రమ్॥

కైలాసముపై నున్నవాడు, ప్రమథ గణముల కధిపతి, కంఠమునందు నీల వర్ణమున్నవాడు, నందివాహనుడు, సత్వరజస్తమో గుణముల కతీతుడు, ప్రకాశించువాడు, భస్మముచే అలంకరించబడిన శరీరము కలవాడు, భవానీపతి, పంచముఖుడు అగు పరమేశ్వరుని సేవించుచున్నాను.

04. శివాకాన్త శమ్భో శశాఙ్కార్ధ మౌళే
మహేశాన శూలిన్ జటాజూట ధారిన్।
త్వమేకో జగద్వ్యాపకో విశ్వరూపః
ప్రసీద ప్రసీద ప్రభో పూర్ణరూప॥

ఓ పార్వతీపతీ! శంభో! చంద్రమౌళీ! మహేశ్వరా! శూలమును ధరించిన వాడా! జటాజూటమున్న వాడా! నీ వొక్కడివే ప్రపంచమంతా వ్యాపించిన విశ్వరూపుడవు. ఓ ప్రభూ! పరిపూర్ణరూపుడా! ప్రసన్నుడ వగుము.

05. పరాత్మాన మేకం జగద్బీజ మాద్యం
నిరీహం నిరాకార హోంకార వేద్యం।
యతో జాయతే పాల్యతే యేన విశ్వం
తమీశం భజే లీయతే యత్ర విశ్వమ్॥

పరమాత్మ, ఒక్కడు, ప్రపంచము ఏర్పడుటకు మూలకారణుడు, కోరికలు లేనివాడు, ఆకారము లేనివాడు, ఓంకారముచే తెలియబడువాడు, ప్రపంచము యొక్క సృష్టి స్థితి లయ లకు ఆధారమైన వాడు అగు పరమేశ్వరుని సేవించు చున్నాను.

06. న భూమిర్న చాపో న వహ్నిర్న వాయుః
న చాకాశ మాస్తే న తన్ద్రా న నిద్రా।
న చోష్ణం న శీతం న దేశో న వేషో
న యస్యాస్తి మూర్తి స్త్రిమూర్తిం తమీడే॥

భూమి - నీరు - నిప్పు - గాలి - ఆకాశము కానివాడు, ఆలస్యము - నిద్ర - వేడి - చలి - దేశము - వేషము లేనివాడు, ఆకారము లేని వాడైనా త్రిమూర్తి స్వరూపుడు అగు పరమేశ్వరుని స్తుతించు చున్నాను.

07. అజం శాశ్వతం కారణం కారణానాం
శివం కేవలం భాసకం భాసకానామ్।
తురీయం తమః పార మాద్యన్తం హీనం
ప్రపద్యే పరం పావనం ద్వైత హీనమ్॥

పుట్టుక లేనివాడు, శాశ్వతుడు, కారణములకే కారణమైన వాడు, శుభకరుడు, కైవల్య స్వరూపుడు, ప్రకాశించు సూర్యుడు చంద్రుడు మొదలగు వారిని కూడా ప్రకాశింప జేయువాడు, సత్వ రజ స్తమో గుణముల కతీతుడుగా నాలుగవ స్వరూపుడు, అజ్ఞానాంధకారమునకు అవతల నున్నవాడు, ఆది అంతము లేనివాడు, పరమ పవిత్రుడు, భేదము లేనివాడు అగు పరమేశ్వరుని శరణు పొందు చున్నాను.

08. నమస్తే నమస్తే విభో విశ్వమూర్తే
నమస్తే నమస్తే చిదానన్ద మూర్తే।
నమస్తే నమస్తే తపోయోగ గమ్య
నమస్తే నమస్తే శ్రుతిజ్ఞాన గమ్య॥

అంతటా వ్యాపించి ఉన్నవాడా! విశ్వ స్వరూపుడా! చిదానందాకారుడా! తపస్సు యోగముల ద్వారా పొంద దగినవాడా! వేద విజ్ఞానముచే తెలుసు కొన దగినవాడా! నీకు నమస్కారము.

09. ప్రభో శూలపాణే విభో విశ్వనాథ
మహాదేవ శమ్భో మహేశ త్రినేత్ర।
శివాకాన్త శాన్త స్మరారే పురారే
త్వదన్యో వరేణ్యో న మాన్యో న గణ్యః॥

ప్రభూ! శూలపాణీ! అంతటా వ్యాపించినవాడా! విశ్వనాథా! మహాదేవా! శంభో! మహేశా! ముక్కంటీ! పార్వతీ వల్లభా! శాంత స్వరూపుడా! మన్మథుని జయించినవాడా!, త్రిపురాసురుని సంహరించినవాడా! నీ కంటే వేరొకడు ప్రార్థించ దగినవాడు, లెక్కించ దగినవాడు లేడు.

10. శంభో మహేశ కరుణామయ శూలపాణే
గౌరీపతే పశుపతే పశుపాశ నాశిన్।
కాశీపతే కరుణయా జగదేతదేకః
త్వం హంసి పాసి విదధాసి మహేశ్వరోసి॥

శంభో! మహేశ్వరా! కరుణామయుడా! శూలపాణీ! గౌరీపతీ! పశుపతీ! ప్రాణుల బంధములను పోగొట్టువాడా! కాశీపతీ! నీవొక్కడివే కరుణతో ఈ ప్రపంచమును నాశనము చేయుచున్నావు. పాలించు చున్నావు. సృష్టించు చున్నావు. నీవు మహేశ్వరుడవు.

11. త్వత్తో జగద్భవతి దేవ భవ స్మరారే
త్వయ్యేవ తిష్ఠతి జగన్మృడ విశ్వనాథ।
త్వయ్యేవ గచ్ఛతి లయం జగదేతదీశ
లింగాత్మకే హర చరాచర విశ్వరూపిన్॥

ఓ దేవా! శంకరా! మన్మథుని జయించినవాడా! నీ నుండే ప్రపంచము పుట్టుచున్నది. ఓ సుఖదాతా! విశ్వనాథా! నీయందే ప్రపంచము నిలుచు చున్నది. ఓ ఈశ్వరా! హరా! ప్రపంచ స్వరూపుడా! లింగరూపుడవైన నీ యందే ఈ ప్రపంచము లీనమగు చున్నది.

// ఇతి శ్రీ శంకరాచార్య విరచిత "వేదసార శివ స్తోత్రమ్" సంపూర్ణమ్ //

– – – = – – –

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)